




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 337 మంగళవారం 3-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## పార్లమెంటులో ప్రతిష్టంభనకు తెర!

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** పార్లమెంటులో పలు అంశాలపై చర్చ జరపాలన్న అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెర పడింది. ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు కేంద్రం అంగీకారం తెలపడంతో ఎట్టకేలకు మంగళవారం నుంచి సభ సజావుగా సాగేందుకు ఇరు పక్షాల మధ్య సయోధ్య ఏర్పడింది. నవంబరు 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ, సంభాల్ హింసాకాండ, మణిపూర్ అశాంతి వంటి విషయాలపై విపక్షాల తీవ్ర ఆందోళనల ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలు నిరంతరం వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే.. పార్లమెంటులో ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి. ఈమేరకు పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ...రాజ్యాంగంపై డిసెంబరు 13, 14 తేదీల్లో లోక్‌సభలో, డిసెంబరు16, 17 తేదీల్లో ఎగువసభలో చర్చ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల్లో చర్చలు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయన్నారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఐదోరోజైన సోమవారం సైతం అంతంతమాత్రంగానే జరిగాయి. అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మౌనం వీడాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై జేపీసీ వేయాలని ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దీంతో, రెండు సభలను వాయిదా వేశారు.



## బ్యారేజీలను డ్యామ్‌లుగా గుర్తిస్తారా?

**మేడిగడ్డ ఎప్పుడు దెబ్బతింది?**

**ఎస్‌డీఎస్‌వో మాజీ ఎస్ఈపై కమిషన్ ప్రశ్నలు**

**అమెరికాలో ఉన్న అధికారితో వర్చువల్ విచారణ**

**నేడు కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్న జస్టిస్ ఘోష్**

**హైదరాబాద్, డిసెంబరు 2:** బ్యారేజీలను డ్యామ్‌లుగా ఏ విధంగా గుర్తించారు? 2019లో బ్యారేజీలు పూర్తయితే 2021లో జాతీయ ఆనకట్టల భద్రత చట్టం (ఎన్‌డీఎసఏ) వచ్చింది.. 2023 జూలైలో కాళేశ్వరం బ్యారేజీలను స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా గుర్తించడం వెనుక ఆంతర్యం ఏమిటి? అని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో)ను కాళేశ్వరం విచారణ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరంపై విచారణలో భాగంగా సోమవారం అమెరికాలో ఉన్న ఎస్‌డీఎసవో మాజీ ఎస్ఈ మురళీకృష్ణను వర్చువల్ విధానంలో కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? అఫిడవిట్‌లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ విధులు బాధ్యత లేమిటి? అని కమిషన్ ప్రశ్నించగా 2021 డిసెంబరు 30వ తేదీన ఎన్‌డీఎసఏను నోటిఫై చేశామని బదులిచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా పరిగణించారా? బ్యారేజీలను ఏ విధంగా డ్యామ్‌లుగా పరిగణించారు? అని ప్రశ్నించింది. దీనికి మురళీ?కృష్ణ బదులిస్తూ 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే వాటితో పాటు చెక్‌డ్యామ్‌ల ఎత్తు 10 మీటర్లు దాటినా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని చెప్పారు. నీటిని మళ్లించడానికే బ్యారేజీలు కడతారు... మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను ఏ విధంగా డ్యామ్‌లుగా పరిగణించారని మళ్లీ కమిషన్ ప్రశ్నించింది.

## మరో 3నెలలు దొడ్డు బియ్యం!

**6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు ఉత్తర్వులు**



**హైదరాబాద్, డిసెంబరు 2:** సన్న బియ్యం పంపిణీని సంక్రాంతి నుంచి ఉగాదికి వాయిదా వేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రాబోయే మూడు నెలలకు సరిపడా దొడ్డు బియ్యం సేకరణపై దృష్టి సారించింది. 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు జిల్లాలు, రైస్ మిల్లుల వారీగా కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోటాలో రాష్ట్ర వాటా (స్టేట్ పూల్) కింద ఆ బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థ సేకరిస్తుంది. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన బియ్యాన్ని ఈ కోటాలో సేకరించనున్నారు. రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించిన తర్వాత భారత ఆహార సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఏ గోదాముల్లో జాగా చూపిస్తే అక్కడికి బియ్యం తీసుకెళ్లి ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆహార భద్రత కార్డులు, ఇతర సంక్షేమ పథకాలకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. మూడు నెలలకు (2025 జనవరి, ఫిబ్రవరి, మార్చి) కలిపి 6 లక్షల టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. ఈ బియ్యం సేకరణకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ జారీ చేయడంతో రైస్ మిల్లర్లు ఎగిరి గంతేస్తున్నారు. ఎందుకంటే.. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే ఎఫ్‌సీఐ బియ్యం తీసుకుంటుంది. అయితే పౌరసరఫరాల సంస్థ కోటాలో బియ్యం ఇవ్వటానికి రైస్ మిల్లర్లు ఇష్టపడతారు. మామూళ్లు ముట్టచెబితే బియ్యం ఎలా ఉన్నా స్థానిక అధికారులు కిమ్మనరన్న నమ్మకమే కారణం. ఇదిలా ఉండగా ఎఫ్‌సీఐకి బియ్యం ఎగ్గొట్టి... పౌర సరఫరాల సంస్థకు బియ్యం కోటా కేటాయింపులు ఇప్పించినందుకు కొందరు మధ్యవర్తులు రైస్ మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసే ఆనవాయితీ ఉంది. టన్నులు, జిల్లాల లెక్కన, కోటా ప్రకారం... డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టజెపుతుంటారు. వాస్తవానికి ఇప్పుడిచ్చిన 6లక్షల టన్నుల కోటాలో ఎవరి ప్రమేయం, పైరవీలు లేవు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల నిమిత్తం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిని కూడా తమ ఖాతాలో వేసుకొని కొందరు మధ్యవర్తులు వనపర్తి, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల రైస్ మిల్లర్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వనపర్తి జిల్లా నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయటంతో మధ్యవర్తులు, మిల్లర్ల మధ్య గొడవలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మహారాష్ట్రకు ఇద్దరు పరిశీలకులు

**- నిర్మల, విజయ్ రూపానీలకు బాధ్యత - రేపు బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక**




**ముంబై, డిసెంబరు 2:** మహారాష్ట్రలో కొత్త సీఎం ఎవరన్న అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించేందుకు బీజేపీ అధిష్టానం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీలను పరిశీలకులుగా నియమించింది. వీరిలో రూపానీ నేడు ముంబై చేరుకోనుండగా నిర్మల 4న చేరుకుంటారు. వీరిద్దరూ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహాయుతి నేతలతో చర్చలు జరుపుతారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ముంబైలోని విధానసభ సెంట్రల్ హాల్‌లో బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక ఉంటుంది. ఫడణవీసను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నాక ఆయననే ముఖ్యమంత్రిగా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆర్ఎసఎస్ మద్దతు కూడా ఫడణవీసకే ఉన్నట్లు సమాచారం. ఈ నెల ఐదున సాయంత్రం 5 గంటలకు ముంబై ఆజాద్ మైదానంలో కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న మహారాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ శిందేకు ఫడణవీస్ ఫోన్ చేశారు. ఆరోగ్య వివరాలు కనుక్కోవడమే కాక తన సన్నిహితుడైన గిరీశ్ మహాజన్‌ను శిందే దగ్గరకు పంపారు. అంతకు ముందు అనారోగ్యం కారణంగా శిందే మహాయుతి నేతల సమావేశంతో పాటు మిగతా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నారు. వాస్తవానికి డిప్యూటీ సీఎం పదవితో పాటు హోం శాఖ కూడా ఇవ్వాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. హోంమంత్రిత్వ శాఖ తనకు కేటాయిస్తే సీఎం పదవి లేకపోయినా తన ప్రతిష్ట తగ్గదని, ఒకవేళ తాను కోరిన మంత్రిత్వ శాఖలు ఇవ్వకపోతే ప్రతిపక్ష నేతగా అయినా కొనసాగుతానంటూ శిందే బీజేపీ అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. మరోవైపు, తాను డిప్యూటీ సీఎం రేసులో లేనని శిందే తనయుడు శ్రీకాంత్ చెప్పారు. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్, ఇతర ఎన్సీపీ నేతలు భేటీ అయ్యారు. కొత్త ప్రభుత్వంలో చేపట్టబోయే మంత్రిత్వ శాఖల కేటాయింపులపై చర్చించారు. ఇప్పటికే జరిగిన చర్చల ప్రకారం బీజేపీకి 20, శివసేనకు 12, ఎన్సీపీకి పది మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉంది. ఈ నెల 5న కూటమి తరపున కనీసం 20 మంది మంత్రులు ప్రమాణం చేస్తారని సమాచారం.

## ఐపీఎస్‌ల బెయిల్‌పై విచారణ వాయిదా

**జెత్వానీ కేసులో ముగిసిన పిటిషనర్ల వాదనలు**

**అమరావతి, డిసెంబరు 2:** ముంబై నటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం విచారణ వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యాజ్యాలపై నిర్ణయం వెల్లడించే వరకు పిటిషనర్లపై తొందరపాటు చర్యలు వద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు క్రాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, అప్పటి విజయవాడ ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు... కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. దీంతో సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు సోమవారం మరోసారి విచారణకు వచ్చాయి. అప్పటి ఏసీపీ హనుమంతరావు తరఫున సీనియర్ న్యాయవాది పట్టాభి వాదనలు వినిపించారు. జెత్వానీపై కేసు నమోదు, దర్యాప్తు విషయంలో పిటిషనర్ చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నారని అన్నారు. సీఐడీ కౌంటర్‌లో పేర్కొన్న విషయాలను పత్రికల్లో ప్రచురించడంపై అభ్యంతరం తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై మీడియా ట్రయల్ నిర్వహించడం సరికాదని, ఇది కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందన్నారు. పిటిషనర్లపై న్యాయస్థానానికి దురభిప్రాయాన్ని కలిగించేందుకు ప్రయత్నం చేశారన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... సీనియర్ న్యాయవాది ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపిస్తున్నారా? లేక వార్తల ప్రచురణపై ఏమైనా గ్యాగ్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. వివిధ కేసుల్లో వాదనలు వినిపిస్తున్న చాలామంది న్యాయవాదులు మీడియా ముందుకు వెళ్లి ప్రకటనలు చేస్తున్నారని గుర్తు చేశారు. వ్యాజ్యాలపై మరో రోజు వాదనలు వినిపిస్తానన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.





## ఏడాదిలో 12 వేల ఉద్యోగాల భర్తీ

**- మరిన్ని పోస్టులకు నియామకాలు - పారదర్శకంగా పరీక్షల నిర్వహణ**

**- 100 శాతం బయోమెట్రిక్ హాజరు - ఫలితాలకు ఆటోమేషన్ ప్రాసెసింగ్**

**- టీజీపీఎస్సీ ప్రగతి నివేదిక విడుదల - చైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీ విరమణ**



**హైదరాబాద్, డిసెంబరు 2:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది కాలంలో పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో సుమారు 12 వేల పోస్టులను భర్తీ చేశారు. మరికొన్ని పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. పదవీ కాలం ముగియడంతో పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎససీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త చైర్మన్‌గా బుర్రా వెంకటేశం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కాలంలో టీజీపీఎససీ ద్వారా జరిగిన నియామకాలు, ఇతర ప్రగతిపై అధికారులు ఒక నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం... గత ఏడాది కాలంలో 12,403 పోస్టులను భర్తీ చేశారు. మరికొన్ని పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. పోటీ పరీక్షలను ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించినట్టు ఇందులో పేర్కొన్నారు. 100 శాతం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు. మానవ తప్పిదాలు జరగకుండా ఫలితాల వెల్లడిలో ఆటోమేషన్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. తద్వారా సుదీర్ఘకాలం పట్టే గ్రూపు-4 నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేసినట్టు వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి గ్రూపు-1 పరీక్షను విజయవంతంగా పూర్తి చేసినట్టు పేర్కొన్నారు.

## తమిళనాట ఆగని విధ్వంసం

**- తమిళనాట కొనసాగుతున్న తుఫాను బీభత్సం! - కృష్ణగిరి జిల్లాలో 50 సెం.మీ. వర్షం**

**- చెరువు కట్టలు తెగి కొట్టుకుపోయిన వాహనాలు - ధర్మపురి, సేలం, నామక్కల్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు**

**- తిరువణ్ణామలైలో విరిగిపడిన కొండచరియలు - శిథిలాల నుంచి ఆరు మృతదేహాల వెలికితీత - మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు**

**చెన్నై, డిసెంబరు 2 :** ఫెంగల్ తుఫాను తీరం దాటిన తర్వాత కూడా తమిళనాడును అతలాకుతలం చేస్తోంది. కృష్ణగిరి జిల్లా ఊత్తాంగరై ప్రాంతంలో ఆదివారం 50 సెం.మీ.ల వర్షం కురిసింది. దీంతో ఎక్కూరు అమ్మన్ చెరువు కట్టలు తెగి దిగువకు వరద పోటెత్తి, రహదారి పక్కన నిలిపిన వ్యాన్లు, కార్లు కొట్టుకుపోయాయి. ధర్మపురి, సేలం, నామక్కల్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. ధర్మపురి జిల్లా అన్నై సత్యానగర్, ఆవిన్ నగర్, నంది నగర్ ప్రాంతాల్లో నివాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విల్లుపురం జిల్లాలో తెన్‌పెన్నై, కోరైయారు వాగులు ఉధృతంగా ప్రవహించి నాలుగు గ్రామాలను దీవులుగా మార్చాయి.

వరద బాధిత జిల్లాల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పర్యటించారు. బాధితులకు ఆహారపానీయాలు, దుప్పట్లు, వస్త్రాలు తదితరాలను అందజేశారు. మరోవైపు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి క్రమంగా కోలుకుంటోంది. సోమవారం సాయంత్రానికి కొన్ని ప్రాంతాల్లో వరదనీరు తగ్గుముఖం పట్టింది. తమిళనాడులోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో కొండచరియలు విరిగి పడడంతో దంపతులు సహా ఏడుగురు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తిరువణ్ణామలైలో కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం 4.30 గంటలకు కార్తీక దీపోత్సవం సందర్భంగా అరుణాచలంపై 2,668 అడుగుల ఎత్తున మహాదీపాన్ని వెలిగించే శిఖర భాగం నుంచి హఠాత్తుగా బండరాళ్లు, మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. ఓ ఇంటిపై పెద్ద బండలు, మట్టిపెళ్లలు భారీగా పడ్డాయి. ఆ ఇంట్లో చిక్కుకుపోయిన రాజ్‌కుమార్(32), ఆయన భార్య మీనా(26), పిల్లలు గౌతమ్(9), ఇనియా(7), బంధువుల పిల్లలు మహా(12), వినోదిని(14), రమ్య(12) కోసం అధికారులు గాలింపు చేపట్టి ఆరు మృతదేహాలను వెలికితీశారు. మరొక చిన్నారి కోసం గాలింపు కొనసాగుతోంది.



# భూపాలపల్లి మున్సిపాలిటీ కమీషనర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**ఎమ్మార్పీఎస్ తెలంగాణా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ**




**తొలి సమయం భూపాలపల్లి డిసెంబర్2:** 2వరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ మాట్లాడుతూ....భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వారాంతపు సంతలు అయిన జంగేడు,కాసింపల్లి లోని అంగడిలను బహిరంగ వేలం మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అనేకసార్లు భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేయడం జరిగింది అన్నారు. పరిశీలించిన కలెక్టర్ వెంటనే మూడు అంగడిలను బహిరంగ వేలం వేయాలని భూపాలపల్లి కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారుఅన్నారు అయినప్పటికిని కలెక్టర్ యొక్క ఆదేశాలను బేఖాతరు చేస్తూ తన ఇష్టానుసారం మున్సిపల్ కమిషనర్ ప్రవర్తిస్తున్నారు అన్నారు కొంతమంది ప్రజాప్రతినిధులు తమ స్వార్థం కోసం అంగడిలను వేలం వేయకుండా తక్కువ రేట్లకు అంగడిలను తీసుకొని బ్లాక్ మార్కెట్ దందా చేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు అన్నారు దాదాపుగా ఈ మూడు అంగడిలను బహిరంగ వేలం వేస్తే సంవత్సరానికి మున్సిపాలిటీకి 10 లక్షల ఆదాయం వస్తుంది. అన్నారు .. కమిషనర్ అతని సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి ప్రజా ప్రతినిధుల దగ్గర లంచాలు తీసుకుని వారాంతపు బహిరంగ వేలం వేయకుండా స్వయంగా తానే అడ్డుకుంటున్నాడు అన్నారు .ఇట్టి విషయం గూర్చి ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ పూర్తి స్థాయి నివేదికతో గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు ఇస్తే పరిశీలించి వెంటనే కమిషర్ పట్టించుకోవడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా వర్కింగ్ రేణిగుంట్ల మహేష్ మాదిగ,జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీష్ మాదిగ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ శీలపాక హరీష్ మాదిగలు పాల్గొన్నారు.

# నూతన పోలీస్ కానిస్టేబుల్స్‌కు దిశానిర్దేశం

**విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోని ప్రజలకు సేవలు అందించాలి**

**ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్**





**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 2:** ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. మహబూబాబాద్ జిల్లా నుండి 96 సివిల్, 46 ఏఆర్ కలిపి మొత్తం 142 మంది సెలెక్ట్ అయి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహించడానికి రావడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటాడని శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో సమాన ప్రాధాన్యత మరియు బాధ్యత కలిగి ఉంటారని అన్నారు. నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారుల నుండి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు.నూతన కానిస్టేబుళ్లు అందరికీ వారి వారి శక్తి సామర్థ్యాలకు, విభిన్న నైపుణ్యాలకు తగినట్టుగా అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ క్రైమ్ వంటి సాంకేతికపరమైన నేరాల నేపథ్యంలో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిని అటువంటి చదువులు చదివిన వారికి సైబర్ క్రైమ్, ఐటి సెల్ వంటి విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నేర నియంత్రణలో శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో మహబూబాబాద్ జిల్లలో పోలీసులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని, విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఆసక్తి ఉన్నవారు మరింత మంచి ఉద్యోగాల కోసం ఉన్నత హోదా కోసం శ్రద్ధగా తమ విశ్రాంతి సమయాన్ని వాడుకొని చదువుకోవాలని మరింత మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాస్, ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డి బి ఆర్ బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్.ఐలు అనిల్, సోములు,నాగేశ్వర్రావు, పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు సైకోలు

**ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**




**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ :** ఎస్సీ వర్గీకరణ అడ్డుకుంటున్న మాలలు సైకోలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు మాలల సభలో అంబేద్కర్ ను అవమానించారని మండిపడ్డారు. వివేక్ మాలలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధం..ఈ మేరకు ఆదివారం జరిగిన మాల మహాసభను ఉద్దేశిస్తూ మాట్లాడిన మందకృష్ణ.. ఎస్సీ వర్గీకరణకు ఇంకా అడ్డుపడతామని అంటున్న వారికి సమాజంలో ఎవ్వరి మద్దతు లేదన్నారు. అంబేద్కర్ సామాజిక న్యాయ సూత్రాన్ని ముందుకు నడిపేది మాదిగలే అన్నారు. వర్గీకరణకు అడ్డుపడుతున్న వారు మాలలలో ఉన్న కొంత మంది స్వార్థ పరులేననిలి చెప్పారు. అంబేద్కర్ సామజిక న్యాయ పోరాట రథాన్ని మాలలు అడ్డుకొంటున్నారని, దళితుల్లో ఉన్న మాదిగల హక్కులను మాలల హరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.లి అంబేద్కర్ దళితుల కోసం ఏర్పాటు చేసిన రిజర్వేషన్లు ఒక్క మాలల కోసమే కాదన్నారు. మాదిగలను చదువుకోని వారు అంటున్నారు. ఇది మాలలకు తగదు. నిన్న మాలల సభలో అంబేద్కర్ ను అవమానించారని విమర్శించారు.

**వివేక్ మాలలను తప్పు దోవ పట్టిస్తున్నారు..**

మా జనాభాకు తగ్గట్టు వాటా అడుగుతున్నాం. ఏ వర్గం వారికైనా జనాభాకు తగ్గట్టు ప్రాతినిధ్యం ఉండాలి. అంబేద్కర్ స్ఫూర్తిని మాలల అడ్డుకుంటున్నారు. మా జనాభాకు తగ్గట్టు వాటా అడుగుతున్నాం. ఎస్సీ వర్గీకరణను ఏ పార్టీ ధైర్యంగా వ్యతిరేకించడం లేదు. వర్గీకరణకు వ్యతిరేకించే వారు రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి.లి ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. కాంగ్రెస్ కూడా ఎస్సీ వర్గీకరణ అనుకులంగా ఉంది. ఇప్పుడు ఆ పార్టీలో వివేక్ ది ఏ స్థానం. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకంచే వారు కొత్త పార్టీ పెట్టుకొండి.లి వివేక్ మాలలను తప్పు దోవ పట్టిస్తున్నారు. మాదిగల హక్కులను మాలలు హరిస్తున్నారని మాలల మీటింగ్ కు ఏ పార్టీ నాయకులు రావడం లేదని చెప్పారు.

**అడ్డుకునే వాళ్ళని ఒడిస్తాం..**

దేశంలో అన్ని రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను ఎవ్వరు అడ్డుకోలేరని, మాలలది తొండి ఆట అన్నారు. మీరు పదవుల కోసం పార్టీలు మారారు. మేము మా జాతి ఆశయం.. ఎస్సీ వర్గీకరణ కోసం దేశంలోని అన్ని పార్టీల ప్రముఖులను కలిశాను. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే వాళ్ళని ఒడిస్తాం. రాజకీయం లేకుండా చేస్తాం. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారిని మాదిగలు శత్రువులుగా చూస్తాం. ఆరు నూరైనా ఎస్సీ వర్గీకరణ ఆగదు. ఎస్సీ వర్గీకరణ వద్దు అంటే మాలల మీటింగ్ లో మాదిగలు కూడా ఉండాలి కదా అని ప్రశ్నించారు.

## పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచండి

**డిఎస్పీ తిరుపతి రావు**



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 2:** పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని మహబూబాబాద్ డిఎస్పీ ఎన్.తిరుపతిరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈరోజు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను మహబూబాబాద్ డిఎస్పీ ఎన్.తిరుపతిరావు తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్ ను పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగి కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను సబ్ ఇన్స్పెక్టరు ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను అయన పరిశీంచారు. అనంతరం డిఎస్పీ గారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ %ఖ్రూా% గారు ఆదేశాలమేరకు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేయడం జరిగింది అన్నారు. ప్రజల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. ఫిర్యాదు వచ్చి వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై వున్న నమ్మకానికి తగ్గాటుగానే పోలీసులు. నీజాయితీ తో పనిచేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట లకు భంగం కలిగించే విధంగా వ్యవహారిస్తే అధికారుల నుండి క్రమశిక్షణ చర్యలు తప్పవని తెలిపారు. ఈ తనిఖీల్లో తో రూరల్ సీఐ సరవయ్య, ఎస్.ఐ దీపిక తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణ కాలేజీలో మరో విద్యార్థి ఆత్మహత్య?

**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ 2:**




కళాశాల యాజమాన్యం వేధింపులతో మరో ఇంటర్ విద్యార్థి బలయ్యాడు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ లోని నారాయణ కళాశాలలో సోమవారం సాయంత్రం ఇంటర్ విద్యార్థి ఉరివేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల సమీపంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్ తరలించగా విద్యార్థి అప్పటికే మృతి చెందాడని చెప్పడంతో ...విషయం వెలుగులోకి రాకుండా యాజమాన్యం చాకచక్యంగా విద్యార్థి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలిం చినట్లు తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే... ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న భానోత్ తనుష్ నాయక్ (16) అలియాస్ టింకు సోమవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బాత్రూంకని వెళ్లి బయటికి రావడం ఆలస్యం కావడం తో తోటి విద్యార్థులు గమనించి వెళ్లి చూడగా టింకు ఉరివేసుకొని ఉన్నట్లు సమాచారం.విషయం తెలుసుకున్న యాజమాన్యం హుటాహుటిన విద్యార్థిని సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని తెలియడంతో విద్యార్థిబంధువులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే యాజమాన్యం వేధింపుల కారణంగానే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్నారు.కళాశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీగా పోలీసుబందోబస్తు ఏర్పాటు చేసారు.

## బెయిల్ వచ్చిన వెంటనే మంత్రిగా నియామకమా?

**తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం ప్రశ్న**

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** ఉద్యోగాల నియామకాల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంథిల్ బాలాజీని బెయిల్ వచ్చిన వెంటనే మళ్లీ మంత్రిగా తీసుకోవడంపై సోమవారం సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సీనియర్ మంత్రిగా విధులు నిర్వర్తిస్తుంటే సాక్షులు ప్రభావితం కారా? అని ప్రశ్నించింది. ఈ చర్య కారణంగా నిందితులు స్వతంత్రంగా, నిబ్బరంగా ఉండగలరా అన్న సహేతుక సందేహాలు కలుగుతాయని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎ.జి.మాసిహల ధర్మాసనం వ్యాఖ్యానించింది. చెన్నైలోని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అప్పట్లో రవాణా మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీని 2023 జూన్‌లో అరెస్టు చేశారు.

# దారి లేక ఇబ్బంది పడుతున్నాం ఇప్పించండి


### కేటీఆర్ కాలనీ వాసులు




**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 2:**
దారి లేక ఇబ్బంది పడుతున్నాము దారి ఇవ్వండి అంటే నిరాకరిస్తున్నారని కేటీఆర్ కాలనీ వాసులు ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చారు.. ఈ సందర్భంగా కేటీఆర్ కాలనీ నాయకులు కొండ్ర ఎల్లయ్య మాట్లాడుతూ.. మహబూబాబాద్ టౌన్ 17 వార్డు కు చెందిన కేటీఆర్ కాలనీలో నిరుపేదలు 150 కుటుంబాలు గత పది సంవత్సరాల నుండి అసైన్డ్ భూములో గుడిసెలు వేసుకుని స్థిరనివాసం ఏర్పరచుకున్నాము అన్నారు అట్టి భూమి ఎం ఏ సయ్యద్ పేరున సర్వేనెంబర్ 281/2/3 అసైన్డ్ భూమిగా నమోదు అయి ఉన్నది అన్నారు అప్పుడు న్నటువంటి తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కలెక్టర్ ప్రీతి మీనా భూమి యజమానితో మాట్లాడి సుమారు నాలుగు ఎకరాల భూమిని భూధానం కింద మాకు ఇప్పించారన్నారు. ప్రభుత్వం వారు విద్యుత్తును, మిషన్ భగీరథ వాటర్ సిసి రోడ్ల సౌకర్యం కల్పించారన్నారు మున్సిపాలిటీ డోర్ నెంబర్లు కూడా ఇచ్చారన్నారు. మా కాలనీకి ఆనుకొని ఉన్న భూమిలో పమ్మి కృష్ణమూర్తి మనుమలు తమ్మి వాసు పమ్మి అశోకులు ఉన్నారుఅన్నారు మాకు ఇవ్వవలసిన దారి వీరి దాంట్లో నుంచి రావాల్సి ఉన్నది అన్నారు వారి వద్ద ఇంకా 8 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ ఉన్నది అన్నారు, వీరు అక్రమంగా చాలా భూమిని ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని ఆరోపణలు చేసారు కాలనీవాసులకు ఇవ్వవలసిన 24 ఫీట్ల జాగను వారికి ఉండబడే ఎస్సైన్డ్ ల్యాండ్ నుండి ఇవ్వమని ప్రాధేయ పడుతున్నామని అన్నారు. ఆర్ అండ్ బి రోడ్డుకు వెళ్లాలంటే మాకు ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. కనుక మాకు ఆనుకొని సమీపంలో ఉన్న పమ్మి అశోక్,వాసుకు లకు సంబంధించిన అసైన్డ్ ల్యాండ్ నుండి 24 ఫీట్ల రోడ్డు ఇప్పించగలరని కోరుకుంటున్నామని అన్నారు.. పది సంవత్సరాల నుండి స్థిర నివాసము ఏర్పరచుకొని కేటీఆర్ కాలనీలో జీవిస్తున్న మాకు 24 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేయగలరని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో కేటీఆర్ కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ బిల్లులు, డీఏలు మంజూరు చేయాలి

### ఎస్టీయుటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాడుగుల పర్వత్ రెడ్డి




**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్ 2:**
ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బిల్లులను సత్వరం మంజూరు చేసి వారి ఖాతాలకు జమ చేయాలని ఎస్టిటీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాడుగుల పర్వత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మంకమ్మ తోటలోని టీఎన్జీవో భవన్లో జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిపిఎఫ్ , టిఎస్జిఎల్ఐ ,మెడికల్ రియంబర్స్మెంట్, సప్లిమెంటరీ బిల్లులు , మెడికల్ బిల్లులకు సంబంధించి లక్షలాది రూపాయలు ఈ కుబేర్ లో నిలిచిపోయాయని వాటిని సత్వరం మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సొమ్ము ఉపాధ్యాయుల అవసరాలకు అందుబాటులో లేకుండా పోతుందని వాపోయారు. మిగిలిపోయిన నాలుగు డీ ఏ లను వెంటనే మంజూరు చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బిల్లులు ప్రతినెలా చెల్లించాలని. మధ్యాహ్న భోజన పథకం అమలుకు పాఠశాలల్లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల మెరుగైన వైద్య చికిత్సకు ప్రణాళికలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి ఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు పిన్నింటి తిరుపతిరావు, శనిగెరపు రవి, సాన కిషన్, కందుకూరి దయానంద్, దాసరి శ్రీధర్, వెలిచాల వెంకటస్వామి, కొట్టే లక్ష్మణరావు సీనియర్ నాయకులు మహాదేవుని నారాయణస్వామి జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, జిల్లా నాయకులు యెనగంటి బాలాజీ, కోట శ్యామ్ కుమార్, నాం పవన్, సమ్మయ్య, తాటిపాముల శ్రీనివాస్, సంజీవ చారి, గోలి సతీష్, కిషన్ రావు, రాజేందర్ రెడ్డి, మాధవ స్వామి, నాగరాజ్, సమ్మయ్య, లక్ష్మణాచారి, దాసరి సుభాష్, కందుకూరి శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి రామకృష్ణ , సంజీవ్ తదితరులతోపాటు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# వాజేడు ఎస్సై గన్‌తో
# కాల్చుకొని ఆత్మ హత్య

**- యువతితో కలిసి రిసార్ట్స్‌కు వెళ్లిన ఎస్ఐ - తెల్లవారుజామున ఊహించని ఘటన**




**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 2:**
సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఓ ఎస్ఐ ప్రాణాలు విడిచిన విషాద ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. వాజేడు మండల ఎస్ఐ రుద్రారపు హరీష్ ముళ్లకట్ట వద్ద గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఫెరిదో రిసార్ట్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం జరిగింది. ఆదివారం ఎస్ఐ స్టేషన్ నుంచి వెళ్లి ఆ తర్వాత రాలేదు.. ఈ క్రమంలో ఎస్ఐ ఓ యువతితో కలిసి రిసార్ట్ కు వెళ్లారు.. ఆ తర్వాత ఉదయాన్నే ఈ ఘటన జరిగింది. ఆదివారం బందోబస్తు అనంతరం.. ఎస్సై హరీష్ రాత్రి 9 గంటల సమయంలో యువతితో కలిసి రిసార్ట్స్ కు వెళ్లారు. ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆ యువతి ఎస్సైతో పాటే ఆ గదిలో ఉంది.. ఎస్ఐ గన్ తో కాల్చుకున్న తర్వాత.. ఆ యువతి పోలీసులకు సమాచారం ఇచ్చింది.. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.. ఇంతకీ ఆ యువతి ఎవరు..? అసలు ఏం జరిగిందనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హరీష్ చనిపోయాక ఆయన మృతదేహం మీద పడి ఏడుస్తూ కనిపించింది. ఎస్ఐ ఆత్మహత్యకు పెళ్లి వ్యవహారమే కారణమని అనుమానిస్తున్నారు. ఇంట్లో వేరే పెళ్లి సంబంధం చూస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు పోలీసులు. ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణజరుపుతున్నారు. ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామం.. హరీష్ మృతి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా.. వారం రోజుల క్రితం వాజేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు ఆదివాసీలను మావోయిస్టులు హతమార్చారు. ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ గా పని చేస్తున్న హరీష్ ఇప్పుడు సూసైడ్ చేసుకోవడం సంచలనంగా మారింది.

**ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో..**
వాజేడు ఎస్సై సూసైడ్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.. ఆయన యువతిని ప్రేమిస్తున్నట్లు తెలుస్తుంది. ఇంట్లో వేరే పెళ్లి సంబంధం చూస్తుండడంతో మనస్థాపానికి గురైన ఎస్సై.. ఈ క్రమంలోనే ఆ యువతితో కలిసి రిసార్ట్స్ కు వెళ్లారు.. పెళ్లి వ్యవహారంతోనే మనస్థాపానికి గురై గన్ తో కాల్చుకొని చనిపోయినట్లు తెలుస్తోంది.



### ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల
# మృతదేహాలను భద్రపరచండి

**పోలీసులకు హైకోర్టు ఆదేశం**



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 2:**
మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని కోర్టుకు వివరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత రేపటి వరకు మృతదేహాలను భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకుచూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

### కొమరారం,బోడులను మండలాలుగా
## ఇల్లందు రెవెన్యూగా ప్రకటించాలి

**తొలి సమయం. ఇల్లందు డిసెంబర్ 2**



టేకులపల్లి మండలం లో బీటీ రోడ్ల శంకుస్థాపనలకు హాజరైన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు,పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణిలు కుమురారం బోడు లను మండలాలుగా ఏర్పాటు చేసి ఇల్లందు రెవెన్యూగా ప్రకటించాలి అని వినతిపత్రం సమర్పించారు.

### ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులు సత్వర
## పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాహుల్ శర్మ**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 2 :**
సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు ఇవ్వడానికి మూడు చక్రాల సైకిల్ పై వచ్చిన దివ్యాన్ గుడి ని పింఛను వస్తుందా ..ఎంత వస్తుందని ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ వస్తుందని ఉపాధి కొరకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం అందించాలని కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుండి వచ్చిన దరఖాస్తులు పరిష్కరించి ప్రజావాణి వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యాలయ పరిధిలో ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించి సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం చాలా ముఖ్యమైనదని దరఖాస్తులు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 35 మంది దరఖా స్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్డిఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# టెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**తొలి సమయం కరీంనగర్ డిసెంబర్ 02**

విఎన్ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న టెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులను టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో అల్ఫోర్స్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఐఐటి నీటిలో శిక్షణ ఇచ్చిన మాదిరిగానే టెట్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు ఈ మేరకు ఆయన క్యాంప్ ఆఫీస్ లో టెట్ శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు నియోజకవర్గాల పర్యటించిన పర్యటనలో భాగంగా నిరుద్యోగులకు అందుబాటులో ఉచితంగా ఆల్ ఫోర్స్ ఈ క్లాస్ యాప్ ను అందజేయగా అందులో ఇప్పటికే 50000 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు అందులో 56 కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించి స్టడీ మెటీరియల్ ఉంచినట్లు ఆయన వివరించారు.

అలాగే కరీంనగర్ చెందిన యువత కోసం టెట్ అభ్యర్థులకు ఉపయోగపడేలా వీఎన్నార్ క్లాసెస్ పేరుతో తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు ఇందులో భాగంగా తరగతులు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో తరగతులు ఉంటాయన్నారు ఎందుకోసం అభ్యర్థులు డిసెంబర్ 3,4 తేదీలలో ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేసి తరగతులు నిర్వహిస్తామని ఆయన వివరించారు ఎందుకోసం హైదరాబాదు నుంచి సీనియర్ ఫ్యాకల్టీ తో తరగతులు నిర్వహిస్తామని చెప్పారు ఎందుకు సహకరించిన కిడ్స్ ట్యుటోరియల్ నిర్వాహకులు సత్యం టీచర్స్ అకాడమీ నిర్వాహకుడు చందు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ తరగతులు ఉదయం 9 గంటల నుంచి ఐదు గంటల వరకు తరగతులు ఉంటాయని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

## తెలంగాణలో విచ్చలవిడిగా

# బెల్ట్ షాప్‌ల నిర్వహణ

**లైసెన్స్ షాప్ లలో అధిక ధరలకి మద్యం విక్రయం**

**యువత తాగుడికి బానిస గా మారుతున్న పట్టించుకోని ప్రభుత్వం**

**బెల్ట్ షాప్ లని ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఏమైంది**

**మద్యం, డ్రగ్స్ ని నియంత్రణ చేయాలి**

**పి వై ఏల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్**



**తొలి సమయం ఇల్లందు డిసెంబర్ 2:**
రాష్ట్రము లో డ్రగ్స్, గంజాయి తో పాటు మద్యం ని నియంత్రణ చేయాలనీ పి వై ఏల్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు లో ఎక్సఇంజ్ కార్యాలయం ముందు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు జరఅనంతరం రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో పి వై ఏల్ రాష్ట్ర నాయకులు పర్సిక రవి, చింత నరసింహారావు, మోతిలాల్ లు మాట్లాడుతూ రాష్ట్రము లో డ్రగ్స్, గంజాయి తో పాటు మద్యం ఎరులై పారుతున్నది అన్నారు , యువత తాగుడు కి బానిస గా మారుతు న్నారని అన్నారు ,కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని, వితంతువు లుగా మారి పెన్షన్ తీసుకొని బతుకుతున్నారని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం మధ్యంని ఒక ఆదాయ వనరుగా చూడటం బాధాకరం అన్నారు. ఇది రాష్టానికే సిగ్గుచెటని అన్నారు ,పేదవాళ్ళు ఆర్థికంగా నష్టపోతున్న, ప్రభుత్వం మద్యం ని నిషేదించాలని అన్నారు బెల్ట్ షాప్ లను నియంత్రణ చేయాలఅన్నారు , బెల్ట్ షాప్ లను ఎత్తివేస్తామని అన్నారు ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలనీ అన్నారు ప్రభుత్వం డిమాండ్ చేసిన అనంతరం ఇల్లందు అబ్కారి ఎస్సై గ్రామాలలో బెల్ట్ షాప్ లని నియంత్రణ చేయాలనీ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమం లో అటికం శేకర్, లాజర్, జోగా క్రిష్ణ, తారచంద్, మాలు, ఇర్ప విజయ్, మడకం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ అవినీతిపై ఉద్యమించాల్సిందే

**తొలి సమయం హైదరాబాద్,**

రాజకీయ అవినీతిపై పరస్పర విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ప్రజలు కూడా పెద్దగా రాజకీయనేతల అవినీతిపై చర్చించడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో గత పాలకుల అవినీతి తారాస్థాయికి చేరింది. అలాగే రాష్ట్రాలను అప్పుల్లో ముంచారు. తాజాగా ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్పుల గురించి ప్రస్తావించింది. రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే అప్పులపై శ్వేతపత్రాలను విడుదల చేశారు. కెసిఆర్, జగన్ పాలనలో అవినీతితో పాటు రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకు పోయాయి. విభజన కారణంగా ఈ రెండు కుటుంబాలు బాగా సంపాదించుకున్నాయని అక్కడ చంద్రబాబు..ఇక్కడ రేవంత్ రెడ్డిలు పదేపదే ఆరోపిస్తున్నారు. అవినీతి కారణంగా విభజిత రాష్ట్రాల్లో అభివృద్ధి పక్కకు పోయింది. అభివృద్ధి పేరుతో అప్పులు మిగిలాయి. విభజన కారణంగా ప్రజలకు మిగిలింది అప్పులే. ఇలా నేతలు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అప్పులు చేసి, రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా..కేంద్రం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రాలు చేసే అప్పులపై లేదా కేంద్రం చేసే అప్పులపై ఎక్కడా చెక్ లేకుండా పోయింది. అలాగే రాజకీయ నేతల అవినీతిపైనా కోర్టుల్లో కేసులు తేలడం లేదు. దీనిని నివారించి,రాజకీయాల్లో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకుని రావాలని లోక్‌పాల్ అవసరం ఉందని గతంలోనే సామాజికవేత్త అన్నా హజారే పోరాటం చేసినా లాభం లేకుండా పోయింది. అన్నా ఉద్యమాన్ని హైజాక్ చేసి, ఆప్ పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ఇప్పుడు అవినీతి కేసులో జైలులో ఉన్నారు. కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నించిన కేజ్రీవాల్ ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు జగన్, కెసిఆర్ అవినీతి అక్రమాలపై ఎవరు చర్యలు తీసుకోవాలి..ఎవరు కేసులు పెట్టాలన్నదే ప్రశ్న. గతంలో పదేపదే కెసిఆర్ అవినీతి గురించి మాట్లాడిన ప్రధాని మోడీ ఇప్పుడు చప్పుడు చేయడం లేదు. బిజెపి నేతలు కూడా మిన్నకున్నారు. ఇప్పుడు అన్నాహజారే లాగా ఎవరో ఒకరు ముందుకు రావాల్సి ఉంది. అవినీతిపై ఉద్యమించాల్సి ఉంది. ఎందుకంటే రాజకీయ నేతలు అధికారం కోసం ఉచిత తాయిలాలు ప్రకటించి అమలు చేయడంతో రాష్ట్రాలు దివాళా తీస్తున్నాయి. ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల సమస్యే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే కనిపిస్తోంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవిం చాల్సిందే. గతంలో కొన్ని కేసుల్లో ఉన్న జగన్ జైలుకు వెళ్లి వచ్చాక..బెయిల్‌పై ఉంటూ సిఎంగా అధికారంలో ఉన్నారు. నిజానికి మనదేశంలో చట్టాలు సక్రమంగా లేకపోవడం వల్లనే రాజకీ నేరాలకు సకాలంలో శిక్షలు పడడం లేదు. రాజకీయ నాయకులు తాము చేసే అక్రమాలపై సులువుగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసునే తీసుకుంటే ఎన్నో ఏళ్లుగా ఇది నానుతోంది. నిజానికి కాలపరిమితి విధించి తీర్పులు వెలువరించేలా మన శిక్షాస్మృతిని మార్చుకోవాల్సిన అసవరం ఉంది. అలాగే కేసుల్లో బెయిల్‌పై ఉన్న వ్యక్తి సిఎం పోస్టుకు తగునా అన్నది కూడా చూడాలి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, కాళేశ్వరం అవినీతి, విద్యుత్ పేరుతో లెక్కకు అందని అప్పులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు ఊడ్చేశారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి తెలంగాణలో అధికారం లోకి వచ్చిన మహానుభావులు ఇప్పుడు ఈ అవినీతిపై మాట్లాడం లేదు. కేంద్రంలో పదవులు పొందిన ఇద్దరు మంత్రులు కూడా మాట్లాడడం లేదు. ఇంతకంటే దారుణం ఉండబోదు. ఇలా నేరాలు చేసే వారంతా మన పాలకులు అవుతూ పోతుంటే ప్రజాస్వామ్యంలో నేర సామ్రాజ్యం రాజ్యమేలుతుంది. దీనికితోడు ఎపిలో అరాచకం, అక్రమాలు రాజ్యమేలాయి. కక్షపూరి రాజకీయాలు రాజ్యమేలుతున్న కాలమిది. హుందా రాజకీయాలను పక్కన పెట్టారు. రాజకీయ నేతలు అవినీతికి పాల్పడితే తాటతీయాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. జగన్ పాలనలో జరిగిన ఇసుక, మైనింగ్ మాఫియాలనపైనా చర్యలు తీసుకోవాలి. ఎపి కావచ్చు..తెలంగాణ కావచ్చు... అవినీతి కేసుల్లో ఎవరు ఉన్నా నిగ్గు తేల్చాల్సిందే. ఇలాంటి సదర్భాల్లో కేంద్రంలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. పాలకులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా విచారణ జరపాల్సిందే. లోక్‌పాల్ బిల్లు తెస్తే తప్ప రాజకీయ నాయకుల ఆటలు కట్టించలేం. రాజకీయ అవినీతిపై ప్రత్యేక కోర్టుఉల ఉండాలి. రాజకీయ అవినీతిని అరికడితే తప్ప మనదేశం దరిద్రం తీరదు. చంద్రబాబు కావచ్చు.. జగన్ కావచ్చు..కెసిఆర్ కావచ్చు..అవినీతి ఎవరిదైనా సత్వర విచారణ చేయించి బొక్కలో తోయాల్సిందే. పాలకులన్న వారు నిజాయితీగా ఉండేలా మన చట్టాలు ఉండాలి. అక్రమ సంపాదనలపై నిఘా కన్ను వేయాలి. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలన్న అన్నా హజారే డిమాండ్‌ను ప్రధాని మోడీ పక్కన పెట్టారు. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావడంతో పాటు రాజకీయ నేతల అవినీతి కేసుల్లో త్వరగా విచారణ జరిపి, తీర్పులు వచ్చేలా ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి రాజకీయ అవినీతిని చర్చించేందుకు ఎజెండాగా తయారు చేయాలి. ఏడాదిలోగా ఎలాంటి కేసుకైనా విచారణ ముగించి తీర్పు వచ్చేలా వ్యవస్థలను బలోపేతం చేయాలి. కఠిన శిక్షలు అమలు చేయాలి. చైనాలోలాగా కఠిన శిక్షలు వేస్తూ పోతే తప్ప రాకీయ అవినీతికి చరమగీతం పాడలేం. లేకుంటే తిండికి, గుడ్డకు కూడా గతిలేని వాడు గద్దెనెక్కడం..వందలు, వేల కోట్లకు అధిపతిగా మారడం చూస్తున్నాం. మోడీ హయాంలో కూడా సిబిఐ, ఇడి దాడులు జరుగుతున్నా అవన్నీ రాజకీయ కక్షసాధింపు చర్యలుగానే ఉంటున్నాయి. ఎక్కడా ఒక్క కేసులో శిక్షలు పడ్డ దాఖలాలు లేవు. కవిత లిక్కర్ స్కామ్ తీసుకుంటే ఇడి,సిబిఐ అధికారులు కేసు నిగ్గు తేల్చలేదు. రాజీకయ పార్టీల నేతలంతా ఒకే తాను ముక్కలు కావడంతో లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావడం లేదు. అది వస్తే తప్ప రాజకీయ అవినీతికి కళ్లెం పడదు. రాజకీయ అవినీతిని అంతమొందించేలా చట్టాలు బలోపేతం చేసే లోక్‌పాల్ వ్యవస్థకు శ్రీకారం చుట్టే సాహసం చేయాలి.

## దాసరి కనకమ్మ కుటుంబానికి
# పద్మశాలి సంఘం అండ

**ఐదు వేల ఆర్థిక సాయం**

**కరెంటు మీటర్, నల్ల కలెక్షన్ కోసం తక్షణ హామీ**



**తొలి సమయం ఎల్కతుర్తి, డిసెంబర్ 02**
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. కడు నిరుపేద కుటుంబానికి చెందిన పద్మశాలి మహిళ చనిపోవడంతో ఒక్కగానొక్క కుమార్తె సమ్మక్క ఒంటరైనది. నిరుపేద కుటుంబానికి చెందడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబానికి అఖిల భారత పద్మశాలి హనుమకొండ జిల్లా కమిటీ ముందుకు వచ్చి అండగా నిలిచింది. కుటుంబానికి 5 వేల నగదు రూపాయల ఆర్థిక సాయంతో పాటు, చీకట్లో మగ్గుతున్న కుటుంబానికి కరెంటు మీటర్ ఏర్పాటుతో పాటు, నల్లా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు తక్షణ హామీ ఇచ్చింది. పద్మశాలి సమస్యల సాధన కోసం జిల్లా కమిటీ ఎల్లప్పుడూ ముందు నిలుస్తుందని జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు సత్కూరి సంతోష్, కార్యదర్శి గైనీ సత్యనారాయణ, దేవసాని సదానందం,వేముల సమ్మయ్య, దాసరి నాగభూషణం, దాసరి రాజయ్య, శ్రీనివాసు, బిట్ల రవి, వేముల శివ, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## మార్పు గ్రామాల నుంచే మొదలు కావాలి !

**తొలి సమయం హైదరాబాద్,**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు, ఆ తరవాత పార్లమెంట్ ఎన్నికలు కూడా ముగిసాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నది. సిఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెల్లగా అడుగులు వేస్తున్నా..గట్టిగానే పడుతున్నాయి. అనేక జటిల సమస్యలకు పరిష్కారం చూపేదిశగా పాలన సాగుతోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే..ప్రజారంకంగానే ముందుకు సాగుతున్నారని అర్థం చేసుకోవచ్చు. ఇదే సమయంలో విపక్ష బిఆర్ఎస్ కేవలం విమర్శక పాత్రకే పరిమితం అయ్యింది. తమ పదేళ్ల పాలన వైఫల్యాలపై సమాధానం ఇవ్వడం లేదు. ఫోన్ ట్యాపింగ్ కావచ్చు..అప్పులు కావచ్చు.. వ్యవస్థలను భ్రష్టు పట్టించడం కావచ్చు..ధరణిపేరుతో దోపిడీ కావచ్చు...భూములను చెరపట్టడం కావచ్చు..ఇలా చెప్పుకుంటూ పోతే అనేకానేక సమస్యలపై నిత్యం వస్తున్న విమర్శలను పట్టించుకోకుండా అతితెలివితో ఎదురుదాడి విమర్వలకు దిగుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ మరో ఎన్నికల సమరానికి తెరలేవనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయి. సర్పంచ్, మండలాలు, జడ్పీల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికలు కూడా అధికార కాంగ్రెస్‌కు, విపక్ష బిజెపి, బిఆర్ఎస్‌లకు కీలకం కానున్నాయి. కిందిస్థాయిలో పట్టు సాధించాలంటే ఈ ఎన్నికల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పాలనాతీరులో మార్పు రావాల్సి ఉంది. మూస పాలనకు, తాయిలాలకు దూరంగా ఉండాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యక్రమాలు ఉండాలి. కొత్తగా రేషన్ కార్డులు ఇస్తామంటున్న ప్రభుత్వం..ఉన్న రేషన్ కార్డుల్లో నకిలీవెన్ని అన్న గుర్తింపు చేయాలి. రేషన్ కార్డుల ఏరివేత తరవాతనే కొత్త రేషన్ కార్డులు చేపట్టాలి. అలాగే బియ్యం ధరలు మండిపోతున్న వేళ..కిలో రూపాయి బియ్యం పథకాన్ని సమీక్షించాలి. రూపాయికి కొత్తిమీర కూడా రాని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాలన్ని కొనసాగించడం సరికాదు. ఇకపోతే గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల రచన జరగడం లేదు. గ్రామస్థాయి నుంచి ప్రణాళిక సాగివుంటే గ్రామాలు బాగుపడి రాష్ట్రం, దేశం బగుపడేది. కానీ అలాంటి ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. పట్టణాలపై భారం పడదు. గ్రామాల్లో విద్య,వైద్యం, సాగు,తాగునీ టి సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. అన్నీ సచివాలయం నుంచి సిఎంల పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడా నికి కారణం అవుతున్నాయి. గ్రాసమస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగేలా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు,సర్పంచ్‌లు కూడా బాధ్యతా రహితంగా వ్యవహరించడంవల్ల ఇంతకాలం గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగలేదు. కేంద్రం నేరుగా నిధులు ఇస్తోంది. అయినా వాటిని పక్కదారి పట్టించారు. వివిధ పథకాలతో సర్పంచ్‌లకు బాధ్యత లేకుండా చేస్తున్నపెత్తనాన్ని తగ్గించుకుని, స్థానిక సంస్థలకు రాజీవ్ హయాంలో ఇచ్చి సవరణల ప్రకారం అధికారాలను బదిలీ చేయాలి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేయడం సరికాదు. ఎపిలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామా సర్పంచ్ వ్యవస్థను గత జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. సర్పంచ్‌లకు బాధ్యతలు లేకుండా చేయడం సరికాదు. ఎపిలో ఆర్బీకెలతో పెత్తనం సాగించారు. ఎన్నికైన సర్పంచ్‌లను డమ్మీలుగా చేస్తూ..వారికి నిధులు కేటాయించ కుండా..వారిని పనిచేయనీయకుండా పెత్తనం చెలాయించడంతో గ్రామాలు సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదలచేసి, అమలు చేయించేలా కార్యాక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రలుగా తీర్చి దిద్దాలి. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. ప్రతి పనికీ సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం సాధిస్తుంది. అలాగే ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పారిశుధ్య కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగతమైన శ్రద్ధకు సంబంధించి నదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పత్రికల్లో ప్రకటనల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. చెత్తను వీదుల్లో పడేయడం, కాలువల్లో పడేయడం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై బాధ్యత లేకుండా పోయింది. చెత్త ఎత్తేయడం అధికారుల పని అన్న భావనలో ప్రజలు ఉన్నారు. పారిశుద్దయం, పచ్చదనం, పర్యావరణపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగాలి. చైతన్యం చేయాలి. గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101